క్లుప్తంగా

స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ నేడు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం 6:30 గంటలకు స్వామి, అమ్మవార్లకు వైభవంగా పల్లకి సేవ జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

పరుచూరి నారయ్యకు నివాళి

కోవూరు: పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు, కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన పరుచూరి నారయ్య ఐదో వర్ధంతిని స్థానిక సుందరయ్య కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ప్రారంభించారు. సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహన్‌రావు, తుళ్లూరు గోపాల్, గోగుల శ్రీనివాసులు, పుల్లయ్య, రెహనాబేగం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నగరాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(పొగతోట): వెంకటాచలం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ రాజేశ్వరితో పాటు సహకరించిన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను పంపనున్నామని, వారిచ్చే వివరణ ఆధారంగా చర్యలు చేపడతామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు.

కండలేరులో 44.420 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 44.420 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,450, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

27న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 27న నిర్వహించనున్నామని సీఈఓ మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్న సమావేశానికి స్థాయీ సంఘాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

యూనియన్ బ్యాంక్‌లో సెల్లింగ్ ఏజెంట్లుగా అవకాశం

నెల్లూరు(అర్బన్): గృహ రుణాలకు సంబంధించి కస్టమర్లను సిఫార్సు చేసి కమీషన్‌తో మంచి ఆదాయాన్ని పొందేందుకు గానూ డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లుగా అర్హులను నియమిస్తున్నామని మాగుంట లేఅవుట్లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక బిల్డర్లు, వారి సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, పదో తరగతి పాసైన వారు, ప్రభుత్వ రంగ బ్యాంకుల మాజీ ఉద్యోగులు, ఆర్థిక సేవల రంగంలో ఉన్న వ్యక్తులు, ఫర్మ్ కంపెనీలు తదితరులకు అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను మాగుంట లేఅవుట్లోని తమ కార్యాలయ రెండో ఫ్లోర్‌లో సమర్పించాలని కోరారు.

రైతులకు కష్టాలు

- వర్షానికి వాలిపోయిన వరి పంట

పొదలకూరు: మండలంలోని పెన్నార్ డెల్టా గ్రామాల్లో వరి కోతల దశలో ఉన్న సమయంలో రైతులకు కష్టాలు వచ్చాయి. ఎడగారు ఖరీఫ్ కింద మండలంలోని సూరాయపాళెం, విరువూరు, తాటిపర్తి తదితర గ్రామాల్లో వరిసాగు చేస్తున్నారు. గురువారం కురిసిన వర్షానికి వరి కంకులు వాలిపోయాయి. దీంతో కోతలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. శుక్రవారం సైతం ఆకాశం మేఘావృతమై వర్షసూచన ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందారు.

ఆందోళన చెందుతూ..

మండలంలోని పలు గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. తాటిపర్తి, మహ్మదాపురం గ్రామాల్లో దిగుబడి కూడా బాగున్నట్టు రైతులు వెల్లడించారు. అయితే కోతల దశలో వర్షం కురుస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, డేగపూడి తదితర ప్రాంతాల్లో ఆలస్యంగా వరినాట్లు పడినందున కోతలు అక్టోబర్ రెండో వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ గ్రామాల్లో వర్షం కురిసినా వరిపంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉండదంటున్నారు. ముందుగా నాట్లు వేసిన గ్రామాల రైతులు వర్షం సూచన వల్ల భయాందోళనకు గురవుతున్నారు.

మెషీన్లకు డిమాండ్

వరికోతల సమయంలో చినుకులు పడితే వరికోత మెషీన్లకు డిమాండ్ ఏర్పడుతుంది. రైతుల అవసరాన్ని బట్టి ఆయా యజమానులు బాడుగలు పెంచుతుంటారు. సాధారణ రోజుల్లో గంటకు రూ.1,800 నుంచి రూ.2 వేలు తీసుకునే వారు వర్షం కురిస్తే మరో రూ.200 నుంచి రూ.500 వరకు పెంచుతారు.



వరి పంట

అన్నదాతల ఆవేదన

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం మండలంలో కురిసిన వర్షం అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు వందెకరాల్లో వరి నీటమునిగింది. పెనుబల్లిలో పరిస్థితి దారుణంగా మారింది. పంట నాలుగు రోజుల్లో చేతికొస్తుందని ఆశించిన రైతులు ఈ పరిణామంతో హతాశులయ్యారు. ధాన్యానికి మొలకలొచ్చాయని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురావడంలేదని చెప్పారు.



క్షయ నిర్మూలనే లక్ష్యం

కొడవలూరు: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీ, కమ్మపాళెం, రేగడిచెలిక సబ్ సెంటర్లను శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులను పరిశీలించారు. ఎంత మందికి క్షయ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.. ఎంత మందికి నిర్ధారించారనే వివరాలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా క్షయను పూర్తిగా నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు, టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సీహెచ్‌ఓ సోమశేఖర్, ఎమ్మెల్‌హెచ్‌పీలు రేష్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

నవధాన్యాల సాగుపై అవగాహన

విడవలూరు: నవధాన్యాల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పార్లపల్లి రైతుసేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీవన ఎరువుల వాడకాన్ని అలవర్చుకోవాలని కోరారు. పంటను తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు. వీఏఏ శ్వేతలేఖ, సర్పంచ్ స్వాతి, సొసైటీ సీఈఓ రాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కోవూరు: మండలంలోని గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఈ నెల 15 నుంచి 20 వరకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ చిలకల శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరేళ్లలోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా కొత్తగా నమోదు, ఆరేళ్లు పైబడిన వారికి డొమిసైల్ సర్టిఫికెట్ ఆధారంగా.. ఇప్పటివరకు తీసుకోని వారికి అందజేయనున్నామని వివరించారు. రోజూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు ప్రక్రియను నిర్వహించనున్నామని చెప్పారు. సచివాలయాల పరిధిలో దండోరా వేయించి ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చూడాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కావలి పట్టణానికి చెందిన హరిప్రసాద్ పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి వెళ్లే సమయంలో పెట్రోల్ బంకు దాటగానే ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది.

ఈ ప్రమాదంలో హరిప్రసాద్ గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలకు సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సర్వసభ్య సమావేశంలో భాగంగా పార్టీ ఎస్సీ నేతలను శుక్రవారం సత్కరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు మాదిగ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఇన్‌చార్జి కిలివేటి సంజీవయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి స్వర్ణ వెంకయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచేడు, సాల్మాన్‌పురం, చెల్లాయపాళెం, వడ్డిపాళెం, ఇస్కపాళెంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరాను నిలిపేయనున్నామని చెప్పారు.

- **తోటపల్లిగూడూరు:** ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి 132 – 53 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో తోటపల్లిగూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు సరఫరా నిలిపేస్తారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలేరమ్మకు కుంకుమార్చన



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: మండలంలోని మనుబోలు కోదండరామపురంలో పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం అర్చకుడు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

సకాలంలో స్కాలర్‌షిప్‌ల రిజిస్ట్రేషన్లు

- జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి

పొదలకూరు: డిగ్రీ విద్యార్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్లను సకాలంలో పూర్తి చేయాల్సిందిగా జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి ఆదేశించారు. పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు, సైదాపురం మండలాల ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల ప్రిన్సిపల్స్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో డీడీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్, కొత్తగా చేరిన విద్యార్థుల నమోదును త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా సూచించారు. జిల్లాలో 32,459 మందికి గానూ 29,795 మంది స్కాలర్‌షిప్‌లను రెన్యువల్ చేశామన్నారు. కొత్తగా 15,364 మంది విద్యార్థులకు సంబంధించి రిజిస్ట్రేషన్లను ప్రారంభించామన్నారు. 427 మందివి పూర్తి చేశామని, త్వరలో మిగిలినవి చేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు డీడీ వెల్లడించారు. జిల్లాలో 71 హాస్టళ్లు ఉన్నాయని, పిల్లలు లేకపోవడంతో రెండింటిని తొలగించామన్నారు. మొత్తం 5,670 మంది పిల్లలున్నట్లు చెప్పారు. టెన్త్ విద్యార్థుల కోసం ట్యూటర్లను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

వెంకటాచలం: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

- **పొదలకూరు:** ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. మెమో నంబర్ 57ను తక్షణమే అమలు చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.మాల్యాద్రి, ఎం.శ్రీనివాసులు, డీఎస్ సునీల్‌కుమార్, నాయకులు ఆదిశేషారెడ్డి, బి.కాంతారావు, ఎస్కే మహ్మద్, ప్రవీణ్, శ్రీహరి, గఫూర్, రామకృష్ణ, రామయ్య, గోపీ, రఘురామిరెడ్డి, దొరబాబు పాల్గొన్నారు.



పొదలకూరు: నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

కోవూరు: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌పై అవగాహన సదస్సును పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నుడా అధికారులతో కలిసి శుక్రవారం నిర్వహించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీ కార్తీక్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట విజయలక్ష్మి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, అధికారులు అల్లంపాటి పెంచలరెడ్డి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, జేసీ

ప్రమాదకర స్థితిలో ఆర్చ్‌లు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని బ్రహ్మదేవం హెచ్‌పీ పెట్రోలు బంకుకు సమీపంలో జెన్కో ఏర్పాటు చేసిన ఆర్చ్‌లు ప్రమాదకరంగా మారాయి. జెన్కోకు వెళ్లే రోడ్డుపై ఉన్న ఆర్చ్‌లు ఒరిగిపోయి ఉండగా గాలికి పడిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.



నిరుపయోగంగా గదులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ ముందుభాగంలో నిర్మించిన గదులు నిరుపయోగంగా మారాయి. నదిలో పుణ్యస్నానాలను ఆచరించిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు దీన్ని మహిళా భక్తులు గతంలో ఉపయోగించేవారు. అయితే కొన్నేళ్లుగా దీన్ని పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. కాగా ఈ విషయమై ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డిని సంప్రదించగా, ఆలయం పక్కనే స్నానపు గదులుండటంతో వీటిని వినియోగించడంలేదని బదులిచ్చారు.



సేవల్లో అట్టడుగు స్థానంలో జిల్లా



మాట్లాడుతున్న సంతోషరావు

- పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినియోగదారులకు మంచి సేవలను అందించడంలో జిల్లా విద్యుత్ శాఖ చివరి స్థానంలో ఉందని, పనితీరును మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు స్పష్టం చేశారు. మాగుంట లేఅవుట్లోని ఓ కల్యాణ మండపంలో నెల్లూరు టౌన్, రూరల్, కోవూరు డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు సేవలందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్పీడీసీఎల్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో నెల్లూరు జిల్లా అట్టడుగు స్థానంలో ఉందన్నారు.



హాజరైన అధికారులు, సిబ్బంది

లో ఓల్టేజీ, సింగిల్ ఫేజ్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌ను తగ్గించడం తదితరాల్లో అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు, సిబ్బంది తాము విధులు నిర్వర్తిస్తున్న హెడ్ క్వార్టర్స్‌లో నివాసం ఉండటంలేదని, ఇదే చివరి అవకాశమని.. అప్పటికీ పట్టించుకోకపోతే వారిని గుర్తించి హెచ్‌ఆర్‌ఏ, డీఏను కట్ చేస్తామని హెచ్చరించారు. నిర్దేశించిన సమయానికి రావడంతో పాటు వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్తున్నారే తప్ప ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. జేఎల్‌ఎం గ్రేడ్ – 2 ఉద్యోగులు కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. జిల్లాలో వ్యవసాయ సర్వీసులను మంజూరు చేసే విషయంలో కొంతమంది అధికారులు, సిబ్బంది జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విధంగా వ్యవహరించిన ఓ అధికారిని సస్పెండ్ చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్‌కు గురైన సమయాల్లో నూతన వాటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రైతులు, వినియోగదారుల సాయం కోరవద్దన్నారు. ఆర్డీఏ స్పెస్ స్కీమ్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేజ్ విద్యుత్‌ను అందించేందుకు రూ.400 కోట్లతో పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వీధి దీపాలు పగటి పూట వెలగకుండా వాటికి ఏబీ స్విచ్‌లు, మీటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల జీరో మెయింటెనెన్స్ చేసే సిబ్బందికి నగదు రివార్డులను ప్రకటించి ఏటా ఆగస్టు 15న అందజేస్తామని ప్రకటించారు. పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, ఎస్‌ఈ విజయన్, నెల్లూరు టౌన్, రూరల్, కోవూరు ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్‌చౌదరి, పురంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా

- పీఎం సూర్యఘర్ యోజన కింద సబ్సిడీ
- బీసీలకు రూ.20 వేల అదనపు రాయితీ
- వినియోగదారులకు బ్యాంకు రుణాలు

పొదలకూరు: నగర, పట్టణ, గ్రామాల్లో విద్యుత్‌ను ఆదా చేసుకునేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. రాయితీ నగదుతోపాటు సోలార్ సిస్టమ్‌ను అమర్చుకునేందుకు అయ్యే ఖర్చును బ్యాంకులు రుణాల కింద అందజేయనున్నాయి. ఈ పథకంలో గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతితక్కువ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. గతనెల నుంచి ప్రభుత్వం సోలార్ గృహ వినియోగానికి సంబంధించి బీసీలకు ఎన్ని కిలోవాట్లు పెట్టుకున్నా రూ.20 వేలు అదనపు రాయితీను ప్రకటించింది. ఇంటిపై కనీసం 10 చదరపు అడుగుల స్థలంలో ఒక కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుందంటున్నారు. ఈ పథకంలో భాగంగా బ్యాంక్‌లు తక్కువ వడ్డీతో రుణాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్యపరమైన విద్యుత్ వాడకందారులకు పథకం వర్తించదు. సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంపొందించుకునే వారు రాయితీపై ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తున్నారు. పొదలకూరు పట్టణం, చుట్టుపక్కల ప్రాంతంలో సోలార్ విద్యుత్ కోసం దరఖాస్తులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు పట్టణంలో 30 మంది కనెక్షన్లు తీసుకున్నారు.



సోలార్ సిస్టమ్ ప్యానెల్

రాయితీలిలా..

సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటులో భాగంగా ఒక కిలో వాట్‌తో 120 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.వెయ్యి బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.338 మాత్రమే వస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. 2 కిలోవాట్‌తో 240 యూనిట్ల విద్యుదత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.2 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.333 మాత్రమే వస్తుంది. ఇందుకోసం రూ.60 వేలు రాయితీ వస్తుంది. 3 కిలోవాట్‌తో 360 యూనిట్ల విద్యుదత్పత్తి అవుతున్నందున సాధారణంగా రూ.3 వేలు బిల్లు వచ్చే వినియోగదారునికి రూ.293 మాత్రమే వస్తుంది. రూ.78 వేలు రాయితీను అందుతుంది. ఆసక్తి గల వారు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

బిల్లుల్లో తేడాలు

సోలార్ విద్యుత్ బిల్లుల్లో తేడాలు వస్తున్నాయని పట్టణానికి చెందిన ఒకరిద్దరు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకరు తనకు రూ.23 వేలు బిల్లు వచ్చిందని, మరొకరు రూ.5 వేలు బిల్లు అందజేశారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సోలార్ కనెక్షన్ తీసుకున్న వారికి సోలార్ విద్యుత్‌కు ఒక మీటరు, సాధారణ విద్యుత్‌కు ఒక మీటరు ఏర్పాటు చేయడం జరుగుతుంది. సోలార్ ద్వారా ఆదా అయ్యే మిగులు విద్యుత్‌కు లెక్కలు వేసి సాధారణ విద్యుత్ బిల్లు నుంచి మినహాయించి మిగిలిన మొత్తాన్ని వినియోగదారుడికి అందజేస్తుంటారు. అయితే ఈ బిల్లులు తేడాలు రావడం వల్ల ఫిర్యాదు అందుతున్నాయి.

బీసీలకు అదనపు రాయితీ



గతనెల నుంచి సోలార్ బిగించుకునే బీసీ వర్గాలకు చెందిన వారికి ప్రభుత్వం అదనంగా మరో రూ.20 వేలు రాయితీ ప్రకటించింది. ఎన్ని కిలోవాట్స్ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకున్నా రాయితీ వర్తిస్తుంది. వినియోగదారులు సోలార్ కనెక్షన్లు అధిక సంఖ్యలో బిగించుకుంటే మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేయడం జరుగుతుంది. సోలార్ విద్యుత్‌ను రెగ్యులర్ విద్యుత్ బిల్లులో మినహాయించుకుని బిల్లు అందజేయడం జరుగుతుంది.

– సుబ్రహ్మణ్యం, డీఈ, పొదలకూరు